# భలే 'బ్యాలెన్సింగ్ యాక్ట్'

## సందడిగా సాగిన 2వ రోజు 'టిప్లీ' నాటకోత్సవాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నిర్వహిస్తున్న టిప్లీ అంతర్జాతీయ బాలల నాటకోత్సవాలు రెండో రోజు సందడిగా సాగాయి. నాటకాలు, వివిధ ప్రదర్శనలు, వర్క్‌షాపులతో నాటకోత్సవ ప్రాంగణం కళకళలాడింది. పుణె నుంచి వచ్చిన ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ రీసెర్చ్ (ఐఏపీఏఆర్) ప్రదర్శించిన బ్యాలెన్సింగ్ యాక్ట్ నాటకం పిల్లలను ఉత్సాహపరిచింది. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు నాటకం ప్రారంభం నుంచి చివరి దాకా ప్రదర్శనతో మమేకమకమయ్యారు. బ్యాలెన్సింగ్ యాక్ట్ నాటకంతో స్టేట్ ఆర్ట్ గ్యాలరీలోని పలు హాల్స్‌లో వెంటిలాకిజం, స్టోరీ గమి, ఒగ్గు డోలు, పప్పెట్ మేకింగ్ వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు జరిగాయి.





నాటకంలోని ఓ సన్నివేశం



నాటక పాత్రధారులు

### బ్యాలెన్సింగ్ యాక్ట్..

ఒక ఎర్ర ముక్కు తొడుక్కుని, చిన్న పిల్లలుగా మారి వచ్చిన ఐఏపీఏఆర్ టీం పిల్లలకు ఎంతో వినోదాన్ని పంచుతూనే పిల్లల పట్ల ఎంతో బాధ్యతతో ఈ ప్రదర్శనకు వచ్చింది. ఈ నాటకం చిన్నారులను ఎంతో ఉత్సాహపరిచింది. ఈ ప్రదర్శనలో పిల్లలు ప్రేక్షకులుగా మాత్రమే కాకుండా, నటులతో పాటు నాటకంలో భాగమయ్యారు. పిల్లల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిన ఈ నాటకం గురించి పిల్లలు, ఆ నాటకాన్ని ప్రదర్శించిన వారితో మాట్లాడినప్పుడు.. తమ మనసులోని మాటలను ఇలా పంచుకున్నారు.

### చిన్నారుల సమస్యలే ఇతివృత్తంగా..



పిల్లల సమస్యలను ఈ నాటకంలో ప్రధానంగా తీసుకున్నాం. ఏ ప్రాంతం, ఏ భాష వారైనా అర్థం చేసుకునేలా ఇందులో జిబ్రిష్ (అర్థం లేని పదాలు)ని వాడాం. రోజు వారి దినచర్యలో పిల్లలు హింసకు లోను కావటం ఈ నాటకంలోని వివిధ అంకాల ద్వారా చూపించాం.

– అదితి వెంకటేశ్వర

### సున్నిత అంశాలను స్పృశించాం..



ఇందులో స్కూలు వాతావరణంలో ఉండే ఒత్తిడి మొదలు పిల్లలు లైంగిక వేధింపులకు గురికావటం లాంటి సున్నిత అంశాలను ఈ నాటకం ద్వారా పిల్లల ముందుంచాం.

– నిఖిల్ గాడ్గిల్

### దైనందిన జీవితంలో వలెనే..



రోజు మా లైఫ్‌లో ఏం జరుగుతుందో ఈ నాటకంలో చాలా ఎంటర్‌టెయినింగ్‌గా చూపించారు. వినోదాత్మకంగా ఒక ప్రదర్శన ఉండాలంటే హింసాత్మకంగా ఉండక్కర్లేదు. చాలా సున్నితంగా చెప్పవచ్చు అని అనిపించింది.

– నిఖిత, ఇండియన్ పీపుల్ హైస్కూల్

### స్టోరీ చెప్పడం, చదవడం ఇష్టం..



స్టోరీలు చెప్పటం, చదవటం నాకు చాలా ఇష్టం. ఇక్కడ కొత్తగా పేపర్‌తో బొమ్మలు చేస్తూ, కథ చెప్పటం నేర్పించారు. నేను 4 జంతువుల బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్నాను. దాంతో కొత్త కథ తయారు చేసి చెప్పాను.

– అద్వైత, 3వ తరగతి

### నవ్వుతూ.. నవ్విస్తూ..



వాళ్ల ముఖ కవలికలతో చేసిన యాక్ట్. నవ్వుతూ, నవ్విస్తూ చేసిన ఇలాంటి నాటకం చూడటం ఇదే మొదటిసారి. నేను యానిమేటర్ కావాలనుకుంటున్నాను.

– కావ్య, ఇండియన్ పీపుల్ హైస్కూల్

### చక్కటి నాటకం చూశాం..



ఇంత చక్కటి నాటకం చూసే అవకాశం ఇచ్చిన టిప్లీకి, స్కూల్ వాళ్లకి థ్యాంక్స్. ఇంట్లో, స్కూల్లో రోజు ఎదురయ్యే డిఫరెంట్ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో చూపించారు.

– మేఘన, ఇండియన్ పీపుల్ హైస్కూల్